విద్యతోనే పేదరికం దూరం

- పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- 500 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేసిన డాక్టర్ సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర -లావేరు/రణస్థలం: విద్యతోనే పేదరికాన్ని జయించ వచ్చుని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. లావేరు, రణస్థలం మండలా ల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 500 మంది విద్యార్థులకు అట్ట, పెన్ను, పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదరికంలోనుంచి బయటపడాలంటే విద్యకు మించిన సాధనం లేదని, మంచి ప్రణాళికతో విద్యనభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా కష్టపడి చదవాలని పదోతరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. 100కు 100 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి మీ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌పై తప్పుడు కేసులు పెట్టిన బీజేపీ

మండల కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కొత్తకోట్ల ఖండన

విశాలాంధ్ర-రణస్థలం: ప్రజలు కోసం కేసులు ఎదుర్కోవడం, జైళ్లకు వెళ్లడం రాహుల్ గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదని, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇంచార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ దేశంలో బీజేపీ చేస్తున్న అవినీతి అక్రమాలను రాహుల్ గాంధీ ఎదురిస్తున్నాడనే అక్కసుతో రెండేళ్ల జైలు శిక్ష పడేలా జడ్జిమెంట్ ఇప్పించారన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే వ్యక్తి రాహుల్ కాద న్నారు. ఆయన తండ్రి, తాత, ముత్తాతలంతా ప్రజల కోసం జైలు జీవితం గడిపినవారేనన్నారు. స్వాతంత్ర్యం కోసం 17 ఏళ్లు కఠిన కారాగార శిక్ష అనుభవించిన చరిత్ర నెహ్రూదన్నారు. అయితే రాహుల్‌పై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బంది పెట్టేలా చూడటం దుర్మార్గమన్నారు. రాహుల్ గాంధీకి ఎటువంటి ఇబ్బంది ఎదురైనా తాము తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని తెలిపారు. తామంతా రాహుల్ వెనుకే ఉంటామన్నారు. తక్షణం పెట్టిన తప్పుడు కేసులను బీజేపీ నాయకులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కె.లక్ష్మీ, ఎచ్చెర్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆబోతుల జగదీష్ నాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ మీసాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బందికి షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పురుషోత్తపురం-1 సచివాలయంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీ లఠ్కర్ పలాస తహాశీల్దార్ ఎల్.మధుసూధన రావుకు ఆదేశించారు. శుక్రవారం పలాస ప్రభుత్వాసుపత్రిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన అనంతరం సమీపంలో ఉన్న సచివాలయంను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంనకు వచ్చిన ఆర్జీలు 37 వరకు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా భూ రికార్డులకు సంబంధించి ప్రభుత్వ భూమి (22ఎ)లో తమ భూమి రికార్డు నమోదైందని, దీనిని సరి చేయాలని సంబంధిత భూ యాజమాని ఆర్జీ చేసుకున్నారు. దీనిపై ఎటువంటి సమాధానం ఇవ్వకపోవడాన్ని కలెక్టర్ తప్పు పట్టారు. తక్షణమే దీనికి కారణమైన డిజిటల్ అసిస్టెంట్ స్వాతి, నోషద్ ఆలీమ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తహాశీల్దార్ మధుసూధనరావుకు ఆదేశించారు. అంతకు ముందు ప్రభుత్వ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం లబ్ధిదారుల వివరాలు, కొత్తగా మంజూరైన పింఛన్లు, వారి వివరాలు, కార్యాలయం బోర్డులో పెట్టారో లేదో అడిగి తెలుసుకున్నారు. వార్డు పరిధిలో ఎంతమంది గర్భిణీలున్నారని, వారికి సక్రమంగా పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అనే వివరాలు సంబంధిత ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో ప్రతి ఆర్జీలను కంప్యూటీకరణ చేసి సంబంధిత సిబ్బందికి పరిష్కారం కోసం పంపించాల్సి ఉందని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. అక్కడ నుంచి పలాస మండలం అల్లుకోల గ్రామానికి చేరుకొని సచివాలయంను సందర్శించి కార్యాలయ పని తీరును పరిశీలించారు. ఆయన వెంట ఆర్.ఐ రవి, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

వికలాంగునికి వీల్ చైర్ పంపిణీ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బి గొనప పుట్టుగ గ్రామానికి చెందిన మోహన్ ఇటీవల రైలు ప్రమాదంలో తన రెండు కాళ్ళను పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న నేషనల్ రోటరీ క్లబ్ సంస్థ తరపున వీల్‌చైర్‌ను మోహన్‌కు అందజేశారు. అలాగే హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆ కుటుంబానికి 5వేలు రూపాయలు ఆర్థిక సాయంతో పాటు రెండు నెలలకు సరిపడే నిత్యవసర సరుకులు, కొర్రాయి పుట్టుగ యూత్, జెడి ఫౌండేషన్, సీతయ్య ఫౌండేషన్‌లు ఉమ్మడిగా 5వేలు రూపాయలు ఆర్థిక సాయం ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్రి ప్రకాష్, సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు రమేష్, సాహు కాళీ, సిసింద్రీ, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, జెడి ఫౌండేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.24.96 లక్షలకు మార్కెట్ ఆశీలు ఖరారు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో రోజువారీ మార్కెట్ ఆశీస్సులు వసూళ్లకు రూ.24.96 లక్షల రూపాయల కు ఖరారు చేశారు. మియా శుక్రవారం కమిషనర్ కే అప్పలనాయుడు ఆధ్వర్యంలో సాయంత్రం మొదలైన ఆశీల వేలంపాటలో సంకు శరత్ చంద్ర 19.51 లక్షలకు కైవసం చేసుకున్నారు. దీనికి అదనంగా రూ. ఐదు లక్షల 45000 రూపాయలకు స్వీపర్ చార్జీలు తో కలిపి పాటను దక్కించుకున్నారు. బొడ్డేపల్లి దాలినాయుడు 19,50,000 వరకు వెళ్ళగా అదనంగా వెయ్యి రూపాయలు వేసి మూడోసారి బహిరంగ వేలం పాటలో రోజువారి మార్కెట్ ఆశీల పాట సొంతం చేసుకున్నారు. వీరి ఇరువురి మధ్య రెండు లక్షలతో ప్రారంభమై హెరాహోరీగా పాటశాగింది. చివరిగా శరత్చంద్ర కైవసం చేసుకున్నారు. అలాగే గత ఏడాది స్వీపర్ చార్జీలతో 15 లక్షల 39 వేలు ఉండగా ఈసారి మాత్రం 24 లక్షలకు ఎగబాకింది. మార్కెట్లో కమేళ ఆశీల వసూళ్లకు 52 వేలకు శరత్ చంద్ర దక్కించుకున్నారు. చింతాడ వారపు సంత బహిరంగ వేలం పాటకు ఏ ఒక్కరు దరఖాస్తు చేయలేదు. గత ఏడాది కూడా వేలంపాటలో పాల్గొనకపోవడంతో మున్సిపల్ సిబ్బంది వసూలు చేశారు. ఈ వేలంపాటలో మునిసిపల్ ఆర్ ఐ, మేనేజర్, పాటదారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని జడ్పీటీసీ పరామర్శ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం లక్కివలస ఎంపీటీసీ చింతల రాజులు మాతృమూర్తి చింతల తవిటమ్మ మృతి చెందడంతో, సంతబొమ్మాళి మండలం జడ్పిటిసి పాల వసంత రెడ్డి శనివారం ఎంపీటీసీ స్వగ్రామమైన గెద్దలపాడు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయనతోపాటు మండల వైస్ ఎంపిపి ప్రతినిది నక్క భీమారావు, లక్కివలస వలస సర్పంచ్, మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు శ్రీరంగం వీరాస్వామి,మేఘవరం మాజీ సర్పంచ్ పరపటి మేనకేతనరెడ్డి తో పాటు, నాయకులు ఉన్నారు.

27న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-నరసన్నపేట : విశాఖపట్నంకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన పట్టణంలోని చిత్రివీధి ఆవరణలో వున్న భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి మందిరంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం శ్రీ సత్యసాయి సేవా మందిరం, ఎలియన్స్ క్లబ్ ఏర్పాటు చేస్తుందని ప్రతినిధులు, కె.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, రెండు జతల బట్టలు, స్టీల్ ప్లేట్, గ్లాసు, ఫోన్ నెంబర్‌తో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం వి.నాగేశ్వరరావు, క్యాంప్ కోఆర్డినేటర్, సాయికుమార్‌ను (8897757764) సంప్రదించాలని కోరారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి

విశాలాంధ్ర-పలాస : పలాస రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత రైలు కిందపడి 60 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందినట్లు హెచ్.సి కోదండరావు తెలిపారు. మృతునికి సంబంధించిన వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని ఆయన తెలిపారు. మృతదేహాన్ని శుక్రవారం పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి నియోజకవర్గ సమస్యలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పాతపట్నం: ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ బడ్జెట్ 9వ రోజు సమావేశాలలో భాగంగా పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి మాట్లాడుతూ అభివృద్ధి పరంగా అట్టడుగున వున్న పాతపట్నం నియోజక వర్గం, వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారదర్శక పాలనలో తన నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, మహిళా సాధికారతకు జగన్మోహన్ రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను వివరిస్తూ ముఖ్యమంత్రికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం అనివార్య కారణాల వలన పాతపట్నం నియోజక వర్గం పరిధిలో పెండింగులో వున్న పలు అభివృద్ధి పనులను సత్వరమే పరిష్కరించాలని అసెంబ్లీలో కోరారు.

చిరుధాన్యాలతో మేలైన ఆరోగ్యం

విశాలాంధ్ర-మెళియాపుట్టి: చిరుధాన్యాలతో మేలైన ఆరోగ్యం కలుగుతుందని ఏపీఎం లలిత అన్నారు. మండల కేంద్రంలో గల వెలుగు కార్యలయంలో చిరుధాన్యాల మహెూత్సవ కార్యక్రమ నిర్వహణలో భాగంగా శుక్రవారం ఏపిఎం లలిత స్వయంశక్తి సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజ ఎరువులతో పండించిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వలన మేలైన ఆరోగ్యంను పొందవచ్చన్నారు. అనంతరం కార్యాలయం నుంచి మెళియాపుట్టి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి పలు నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు సీసీలు గణేష్, వీరన్నాయుడు, చంద్రమౌళి, విఓఏలు మహిళలు తదితరులున్నారు.

ఉపాధి పనులు పరిశీలన

విశాలాంధ్ర-కంచిలి: మండలంలోని ఎస్ఆర్సిపురం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను సర్పంచ్ ప్రతినిధి డొక్కరి బలరాం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వేతదారులకు, వేతనాలు పెరిగేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను కోరారు. పంచాయితీ పరిధిలో కొత్త పనులకు పరిశీలన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బాబురావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనుబంధ కళాశాలలకు నాక్ గుర్తింపు తప్పనిసరి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహనరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : యూనివర్సిటీ అనుబంధ కళాశాలలకు నాకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె రామ్ మోహన్‌రావు అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీలో శుక్రవారం వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలోగా నాక్ గుర్తింపు పొందేలా కళాశాలలు సన్నద్ధం కావాలన్నారు. 45రోజుల్లో నాక్ గుర్తింపు పొందడం ఎలా అనే అంశంపై రాష్ట్ర ఉన్నత మండలి మార్గదర్శిని రూపొందించామన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశవ్యాప్తంగా సమూల మార్పులు వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా నాణ్యమైన ఉన్నత విద్య అందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ విద్యాసంస్థగా గుర్తింపు పొందేందుకు నాక్ గుర్తింపు తప్పనిసరని చెప్పారు. నాక్ గుర్తింపునకు వెళ్లే కళాశాలను 3.5 లక్షల రూపాయలు చెల్లించాలన్నారు. కళాశాలల్లో విద్యా ప్రమాణాలు అత్యుత్తమ, అనుసరణీయ పద్ధతులు, రికార్డుల నిర్వహణ, డేటా అప్డేషన్ తదితర అంశాలను సమర్థవంతంగా నిర్వహిస్తే నాక్ గుర్తింపు సాధ్యపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్ ఉదయభాస్కర్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ కె స్వప్న వాహిని తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యతో డిఫెన్స్‌లో ఆఫీసర్ ఉద్యోగాలు

- ఆర్మీలో అన్ని విభాగాల్లో ఆఫీసర్లుగా అవకాశం
- ఈనెల 25 నుంచి ఆన్‌లైన్ అవకాశం
- మెరిట్ సాధించిన వారికి ఉచితంగా శిక్షణ
- ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరక్టర్ బి.వి. రమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : భారత రక్షణ రంగంలో ఆఫీసర్ క్యాడర్‌లో మన తెలుగువారి శాతం చాలా తక్కువగా ఉందని, అధికార హెూదాపై సరైన అవగాహన లేకపోవడమే దీనికి కారణమని ఇండియన్ ఆర్మీకాలింగ్ డైరక్టర్ బి.వి. రమణ అన్నారు. నగరంలోని ఇండియన్ ఆర్మీ కాలింగ్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరక్టర్ బి.వి.రమణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో యువతను యుపీఎస్ఎస్, ఎన్‌డీఏ ఆఫీసర్స్, టీఇఎస్, సీడీఎస్ ఆఫీసర్లను ప్రోత్స హించేందుకు ఈ ఏడాది నుంచి టెన్త్ అర్హతతో ప్లస్ 2తో డిఫెన్స్ కోర్సును ప్రారంభించామని తెలిపారు. ఈ కోర్సును పూర్తిస్థాయి సైనిక శిక్షణతో జిల్లాలో ప్రారంభించడంతో యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇంటర్ విద్యతో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పారా మిలటరీ వంటి రంగాల్లో ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలు ఉన్నా ఉత్తరాంధ్ర యువతకు అవగాహన లేక జీడి స్థాయి కింద ఉద్యోగాలకే వెళ్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర నుంచి సుమారు 30 వేల మంది వరకు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి రక్షణ రంగాల్లో పనిచేస్తున్నా రని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆర్మీ అభ్యర్థుల కోసం ఒక అకాడమీని, ఆర్మీ ఆసుప్రతి కానీ, అన్ని సౌకర్యాలతో కూడిన క్యాంటీన్ వంటివి నెలకొల్పక పోవడం బాధాకరమన్నారు.

25 నుంచి రిజిస్ట్రేషన్‌కు అవకాశం... టెన్త్ ప్లస్-2తో డిఫెన్స్‌లో ఆఫీసర్ ఉద్యోగాలు సాధించే దిశగా యువతకు ప్రోత్సహించడంలో భాగంగా ఈనెల 25 నుంచి ఏప్రిల్ 25 వరకు పదోతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఇండియన్‌ఆర్మీకాలింగ్.కాం) వెబ్‌సైట్‌లో రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వీరికి మే నెలలో అకాడమీ ఆధ్వర్యంలో ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి రెండేళ్ల పాటు ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా ఇంటర్ విద్యా తో పాటు డిఫెన్స్ శిక్షణ అందిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని డిఫెన్స్ వైపు వెళ్లాలనుకుంటున్న పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 6281284246, 8712704951 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. అనంతరం అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో చైర్మన్ గోవిందరావు రెండో ఇన్‌చార్జ్ సురేంద్ర, ఎటి శంకరరావులు పాల్గొన్నారు.

దాతృత్వ సంస్థలకు ప్రోత్సాహం అందిస్తాం

-డయాలసిస్ కేంద్రాల్లో బెడ్స్ పెంచేందుకు కృషి
- కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీ లాఠకర్

విశాలాంధ్ర-పలాస : జిల్లాలో గల ఉద్దాన ప్రాంతంలో గల దయాలసిస్ కేంద్రాల్లో అదనంగా బెడ్స్ పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కిడ్నీ బాధితులకు సహాయం అందించేందుకు వచ్చే దాతృత్వ కార్పొరేట్ సంస్థలకు అన్నివిధాలుగా ప్రోత్సహం అందిస్తామని కలెక్టర్ అన్నారు. శుక్రవారం పలాస ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కోరమండల్ గ్రోమోర్, మురుగప్పా ఎరువులు, పురుగుల మందుల కంపెనీల సౌజన్యంతో కిడ్నీ డయాలసీస్ రోగుల కోసం 11 లక్షల రూపాయలు విలువైన 1500 డోసుల ఎరిత్రోపోయిటిన్ మందులను కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ చిన్నంనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతం ఎంతో అందమైన ప్రాంతమని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సహజ అందాలున్నాయని, అయితే కేవలం కిడ్నీ వ్యాధులవలన ఉద్దానం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. దీనిలో భాగంగా పలాస కేంద్రంగా 50 కోట్ల రూపాయలతో 200 పడకల ఆసుపత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రం నిర్మిస్తున్నామని, ఇది పూర్తయితే రోగులకు ఎంతో ఊరట లభిస్తుందని అన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడాన్ని ఆయన అభినందించారు. ప్రస్తుతం అందించిన ఇంజక్షన్లు, వైద్యుల సూచనల మేరకు రోగులకు అందించాలన్నారు. దీంతో పాటు టి.వి వ్యాధిగ్రస్తులకు కూడా జిల్లావ్యాప్తంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని దాతల సహకారంతో ఉచితంగా అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కిడ్నీ లక్షణాలతో ఆసుపత్రులకు రోగులు వస్తే తక్షణం స్పందించి వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. డాక్టర్ మేఘన మాట్లాడుతూ కిడ్నీరోగులకు ఎంత్రోపాయిటీస్ ఎంతో వినియోగపడుతుందని, వీటి పని తనాన్ని వివరించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ భాస్కరరావు, వైద్యులు రఘురామ్, వీరస్వామి, జె.డి.శ్రీధర్, జోనల్ మేనేజర్ కిశోర్, హెచ్.ఆర్ మేనేజర్ అంకిత, ఎం.జయశంకర్‌తో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూములను పోర్టు రోడ్డు కోసం ఇవ్వడం జరగదు

విశాలాంధ్ర-టెక్కలి: తమకు జీవనాధారమైన భూములను భావనపాడు పోర్టు రోడ్డు కోసం ఇవ్వడం కుదరదని టెక్కలి పంచాయతీ పితాపురం, కూర్మనాధపురం రైతులు పేర్కొన్నారు. శుక్రవారం టెక్కలి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జి సుజాత అధ్యక్షతన మండల తహసిల్దార్ కార్యాలయ పరిపాలనాధికారి బెండి గిరిబాబు ఆధ్వర్యంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున పరిపాలనాధికారి గిరిబాబు మాట్లాడుతూ ఈ పోర్టు నిర్మాణం వలన మన ప్రాంతంలో నిరుద్యోగ సమస్య చాలా వరకు తీరుతుందని పోర్టుకు అవసరమైన రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ రేటు కంటే మూడు రెట్లు అధిక మొత్తం ఇస్తామని, అభివృద్ధికి సహకరించాలని రైతులను కోరారు. ఈ ప్రతిపాదనను రైతులు తిరస్కరించారు.తమకు జీవనాధారమైన భూములు వదులుకునే ప్రసక్తి లేదని ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామని అన్నారు, మదన గోపాల సాగరం దిగువున ఉన్న భూములు ఏడాదికి రెండు పంటలు పండుతున్నాయని, అటువంటి భూములు వదులుకుంటే తాము అధోగతి పాలవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలైనా అర్పించి భూములు కాపాడుకుంటామని తెగేసి చెప్పారు. తాము అభివృద్ధి నిరోధకులనము కాదని ప్రభుత్వం ప్రత్యామ్నయం ద్వారా పోర్టు రోడ్డు నిర్మాణం కోసం భూములు సేకరించాలని పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు . ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామని రెవిన్యూ అధికారులు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు బుడుమూరు చంద్రశేఖర్, పట్నాన డిలేశ్వర రావు. బొడ్డేపల్లి వజ్రం, పెరుమాళ్ళ చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

పంచమర్తి అనురాధ గెలుపుతో టీడీపీ సంబరాలు

విశాలాంధ్ర-కవిటి: ఎమ్మెల్సీగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పంచమర్తి అనురాధ గెలుపుతో మండల టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నయి. ఈ మేరకు శుక్రవారం కవిటి మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అశోక్ నివాసం రామయ్యపుట్టుగ లో కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా రాక్షస పాలనకు ప్రజలు చమర గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని చంద్రబాబు నాయకత్వాన్ని తెలుగుదేశం పార్టీ అధికారాన్ని ప్రజలు కోరుకుంటున్నారు అన్నారు.బీసీలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని ప్రతిష్టాత్మకమైన ఎన్నికలో ఎమ్మెల్సీ అభ్యర్థి అనురాధని ఎంపిక చేయడం నిదర్శనం అని అన్నారు.పార్టీ కోసం కష్టపడిన వ్యక్తికి సమస్థానం ఉంటుందని ఎన్నికల ద్వారా పార్టీ అగ్ర నాయకులు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ మరోసారి నిరూపించారని వివరిం చారు.గత పట్టభద్రుల ఎన్నికల్లో ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపికల్లోనే తొలి విజయాన్ని సాధించడానికి దోహదపడ్డారని వివరించారు.ఎమ్మెల్సీగా ఎన్నికైన అనురాధకు కవిటి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తరఫున అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు,బెందాళం రమేష్, ఎస్వీ రమణ, సంతోష్ పట్నాయక్, మణి చంద్ర ప్రకాష్, సదానంద రౌలో, చిన్నబాబు,హేమాచలం, బాసుదేవ్ ప్రధాన్, తిరుమల, పుల్లట సంతోష్, సనపల కామేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా... ఉల్లాసంగా

విశాలాంధ్ర-పొందూరు: మండలం తాడివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. మరికొద్ది రోజుల్లో పబ్లిక్ పరీక్షలకు వెళ్ళబోతున్న 10 వ తరగతి విద్యార్థులకోసం తోటి విద్యార్థులు ఫైర్వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు, విద్యార్థుల డాన్సులతో ఉర్రూతలూగించారు. లఘునాటికలతో, ఏక పాత్రాభినయాలతో విద్యార్థులు అలరించారు.

నిరంతర సాధనతో సత్ఫలితాలు

విశాలాంధ్ర-సోంపేట : పట్టుదల, నిరంతర సాధనతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని వి ఫర్ యు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వివేకానంద గ్రంథాలయంలో చదువుకుంటూ రైల్వే గ్రూప్ డి పోస్టులకు ఎంపిక కాబడిన టి.శ్రీనివాస్, కె.సతీష్, ఎన్.ప్రశాంత్, టి.గణేష్ మరియు ఎర్ర ధనలక్ష్మిలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి ఫర్ యు గ్రంథాలయం సహకారంతో ఉద్యోగాలు సాధించడం సంతోషకరమని మరింత ఉన్నత స్థాయిలకు వెళ్లేందుకు కృషి చేసి, మరికొంత మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జి.రాజేష్, వ్యవస్థాపక సభ్యులు డి.జోగారావు, టి.ధర్మరాజు సంస్థ సభ్యులు మరియు గ్రంథాలయ రీడర్స్ పాల్గొన్నారు.

మున్సి "పాలన"కు రెండేళ్లు

- ఉత్సవ విగ్రహంలా చైర్మన్
- ఆరుగురు సూపర్ చైర్మన్లు
- గాడి తప్పుతున్న పాలన



విశాలాంధ్ర -వలాస: నియోజకవర్గంలో ప్రధాన కేంద్రమైన పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో అధికార పార్టీ అధిపత్య పోరు సాగుతోంది. వైసీపీ అవిర్భావం నుంచి పార్టీ జెండా పట్టుకొని పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికారాల్లోకి శుక్రవారానికి రెండేళు పూర్తి అయింది. ఈ రెండేళ్ల కాలంలో తనదైన శైలిలో పరిపాలన అందిస్తుండగా మరో ఆరుగురు ఇదే పార్టీకి చెందిన వైసీపీ నాయకులు అధినాయకుని పేరును అడ్డం పెట్టుకొని ప్రతి విషయంలో జోక్యం చేసుకుంటున్నారన్న అపవాదు జోరుగా వినిపిస్తోంది. కోటి 60 లక్షల రూపాయలు పార్టీ క్రింద ఖర్చు పెట్టి ముళ్ల కిరీటమైన చైర్మన్ కుర్చీలో కూర్చున్న మొదటి రోజు నుంచి చైర్మన్ గిరిబాబుకు తలనొప్పిగా తయారైంది. పేరుకే అక్కడ చైర్మన్ బల్ల గిరిబాబుకు ప్రభుత్వ పరంగా చట్టబద్ధమైన అధికారాలున్నప్పటికీ ఆయన సజావుగా పాలన సాగించదానికి ఆరుగురు సూపర్ చైర్మన్లు అడ్డు తగులుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్ కూడా చైర్మన్ మాటను విని విననట్లు నటిస్తూ ఆ ఆరుగురి మాటలకే వత్తాసు పలుకుతున్నట్లు పలువురు అంటు న్నారు. ఎటువంటి అధికార పదవులు లేని ఈ ఆరుగురు చెప్పిన మాటే కమిషనర్ వింటారని, దీంతో దిక్కు తోచని పరిస్థితుల్లో మున్సిపల్ కార్యాలయం ఎదుర్కొంటుందని విమర్శలున్నాయి. చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశాలు ఈ కార్యాలయంలో కమిషనర్ గాని, ఇతర ఉద్యోగులు గాని పట్టించుకోరు. చైర్మన్ పదవీ కేవలం దిష్టిబొమ్మలా తయారైందనే విమర్శలు కూడా ఉన్నాయి. కార్యాలయం పాలన, మున్సిపాలిటీ పాలన, ఈ ఆరుగురు సూపర్ చైర్మన్ల చేతుల్లోనే నడుస్తోందని, వారి ఆధిపత్యంతో మున్సిపల్ కార్యాలయంలో ప్రతిపని వారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయని ప్రచారంలో ఉంది. మున్సిపాలిటీలో విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, భవన నిర్మాణాలకు అనుమతులతో పాటు ఎటువంటి పనులు జరగాలన్నా వీరి ప్రమేయం లేకుండా జరగడం లేదనే విమర్శలున్నాయి. మున్సిపల్ కార్యాలయం వ్యవహారం వీరి అదుపు ఆజ్ఞాలతో నడుస్తుండడంతో పాలన గాడి తప్పుతోంది. దీంతో మున్సిపాలిటీలో అధికార వైసీపీ నిలువునా చీలి పోయింది. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న వైసీపీ నాయకులు కార్యకర్తలు ఒక వర్గంగా ఏర్పడి వీరి ఆర్థిక ఆరాచకాలు అధికారంలో జోక్యం పట్ల పలువురు నిరసన తెలియజేస్తున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల ప్రభావం నుంచి ఇప్పటి వరకు పార్టీలో చేరిన వారంతా ఒక కూటమిగా ఏర్పడ్డం, ఆ కూటమిలో ఉన్న వారిలోనే ఈ ఆరుగురు సూపర్ చైర్మన్లు ఉన్నారని, పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. మరో ఏడాది కాలంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపధ్యంలో పార్టీ ఎన్నికల కోసం ఐక్యమత్యంతో సమాయత్తం కావాల్సిన వైసీపీ పార్టీలో గందరగోళ పరిస్థితులు మున్సిపాలిటీలో ఏర్పడ్డాయి. విబేధాలు పరిష్కారించాల్సిన పెద్దలు మౌనం దాల్చడంతో పార్టీలో గ్రూపు తగాదాలు ముమ్మరవుతున్నాయి. వైసీపీలో వైసీపీ కార్యకర్తలే ప్రత్యార్థులుగా తయారయ్యారని, వైసీపీకి వైసీపీయే శత్రువుగా తయారయ్యే ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయని పలువురు భావిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ గ్రూపు తగాదాలు ఎటువైపు మలుపు తిరుగుతాయోనని వైసీపీ అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

లేగ దూడల ప్రదర్శన

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : మండలం లోని కొండవలస గ్రామంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ లావేటి విశ్వేశ్వర రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డి.ఎల్.డి.ఏ డి.డి డాక్టర్. శివ్వాల మన్మధరావు హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో హెచ్ ఎఫ్, జెర్సీ, గిర్ జాతులకు చెందిన దూడలను రైతులు ఉత్సాహంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో భాత్య వెంకట రమణ, చీపురు సూర్యనారాయణ ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. కార్యక్రంలో పాల్గొన్న రైతులందరికీ బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. డి సతీష్ కుమార్, డాక్టర్. ఎస్ కరుణ, డి.ఎల్.డి.ఏ. డాక్టర్. రాధాకుమారి, సరుబుజ్జిలి మండల పశు వర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సింగర్ 'సొనాలిక'కు అభినందన

విశాలాంధ్ర-నరసన్నపేట : హైదరాబాద్‌కు చెందిన వాయిస్ ఆఫ్ హైదరాబాద్ ఇటీవల నిర్వహించిన తెలుగు పాటల పోటీల్లో 4వ ఆడిషన్స్‌లో ఫైనల్‌కు ఎంపికై, మొదటి స్థానం సాధించిన పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీకి చెందిన బుద్దల సొనాలికకు ఉగాది పర్వదినం సంధర్భంగా ఘనంగా సన్మానం చేశారు. శిష్టకరణ కార్పొరేషన్ డైరక్టర్, సదాశివుని కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, శ్రీనివాస పండిట్ మేజిక్ షో, ఎస్సీ బాలికల వసతిగృహ విధ్యార్థినుల నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ డైరక్టర్, పొట్నూరు ప్రసాద్, మేజర్ పంచాయితీ ఉప సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, ఎంపిటీసిలు, వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజేశ్వరరావు, వైసిపి నాయకులు, బుద్దల రాజశేఖర్, ఏజీపి, గొండు సత్యన్నారాయణ, జర్నలిస్ట్ కాలనీవాసులు, డా.రామచంద్రరావు, పుచ్చల ప్రసాద్, బలివాడ చిట్టి వంతులు, అనుపోజు వెంకట్రావు మాస్టర్, వసతిగృహ వార్డెన్‌లు, టెంక సూర్యప్రభ, తట్ట త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

కమశిక్షణతో విద్యార్థులు ఎదగాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: విద్యార్థులు క్రమశిక్షణతో ఎదిగి తమ భవిష్యత్‌ను బంగారు బాటగా మలుచుకోవాలని అక్కుపల్లి ప్రభుత్వాసుపత్రి వైద్యులు దువ్వాడ దివ్య అన్నారు. శుక్రవారం అక్కుపల్లి మత్స్యకార గురుకుల పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎదగాలంటే పదో తరగతి పునాది వంటిందని, ఈ కాలంలో తప్పటడుగు వేస్తే భవిష్యత్ నాశమవుతుందని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పట్టుదలతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, గురువులు కన్న కలలను నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాపారావు, ఎంఇవో తులసిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

విశాలాంధ్ర-కవిటి : కవిటి మండలం లండారిపుట్టుగ పంచాయతీ పొందూరుపుట్టుగ గ్రామానికి చెందిన పొందూరు కృష్ణవేణి నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ. ఆమె పలు సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. బతుకు తెరువు కోసం భర్త ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో పిల్లలను కూడా చదివించుకునే పరిస్థితి చాలా కష్టంగా మారింది. ఇటీవల సోంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చేరి ఇటీవల డిశ్చార్జ్ కావడంతో ఆమె పరిస్థితిని గమనించిన నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ప్రతినిధి కంచిలి మండలం ఎక్కల గ్రామానికి చెందిన ఎన్.జగన్ పెద్ద మనస్సుతో రెండు నెలలకు సరిపడే విధంగా కిరాణా సరుకులను శుక్రవారం ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.జానకిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం నౌపడ గ్రామానికి చెందిన కనిరెడ్డి భార్గవ్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన భార్య కనిరెడ్డి భార్గవి దేవికి ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు లక్షల 90 వేల రూపాయలు నౌపడా సర్పంచ్ తిలక బృందావతీ రవికుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. నెలరోజుల

క్రితం భార్గవ్ రెడ్డి ప్రమాదవశాత్తు, ద్విచక్ర వాహన వాహనంపై ప్రయాణం చేస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతి చెందిన వెంటనే వైయస్సార్ భీమా పథకం కింద తక్షణ ఆర్థిక సహాయం పదివేల రూపాయలు అందజేయగా, శనివారం నాలుగు లక్షల 90 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయం అధికారులు, తదితరులు ఉన్నారు.

పంచుమర్తి గెలుపు... వైకాపా పతనానికి మలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎమ్మెల్యే కోటాలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ గెలుపొందడం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పటిష్టమైన వ్యూహం అని టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో శ్రీకాకుళం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండలక్ష్మీదేవితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పై ఎమ్మెల్యేలకు ఉన్న అసంతృప్తి కొట్టొచ్చినట్లు కనిపించిందని, వైకాపా ప్రభుత్వ పాలనపై ప్రజాల్లోనూ, ఆ ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేల్లోను పెల్లుబికుతున్న వ్యతిరేకత, మొన్న జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల లోనూ, నిన్న జరిగిన ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ను స్పష్టంగా కనిపడిందని తెలిపారు. వైకాపా ప్రభుత్వం ఈ నాలుగేళ్ల పాలనలో అప్పులు తప్ప అభివృద్ధికి నోచుకోలేదని, రాష్ట్ర ప్రజలు కూడా అప్పుల్లో కూరుకుపోయారని, సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని రవికుమార్ తెలిపారు. ఈ విజయోత్సవ వేడుకలో కూన రవికుమార్ కేకు కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, జామి భీమశంకర్, యంకన్న యాదవ్, చిట్టి నాగభూషణ్, జల్లు రాజీవ్, పార్వతీశం, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

డ్వాక్రా మహిళల సంబరాలు

విశాలాంధ్ర-మందస : రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా తమ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్న సందర్భంగా ముందస్తుగానే శుక్రవారం మండలం బేతాళపురం గ్రామంలో మహిళా సంఘాలు సంబరాలు చేసుకున్నాయి. గ్రామానికి చెందిన పెద్దమ్మ తల్లి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఎపిఎం ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలకు మూడు విడతలకు కోటి 12 లక్షల 77వేల 402 రూపాయలు జమ చేయడం జరుగుతుందని ప్రసాదరావు తెలిపారు. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ ఉద్యానవన యూనివర్శిటీ బోర్డు సభ్యులు బత్తిన లక్ష్మణ్, సింహాద్రి పాపారావు, మనోజ్, కపిల్, నారాయణ, మోహన్‌లు పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పలాస : పలాస పిఎసిఎస్ ద్వారా రైతులకు మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించాలని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి) అన్నారు. శుక్రవారం కార్యాలయంలో భూ అభివృద్ధి రుణాలకు సంబంధించి రైతులకు 22లక్షల రూపాయల చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస మండలం కైజోల గ్రామానికి చెందిన బత్తిన అప్పలస్వామికి 5 లక్షలు, కొత్తూరు గ్రామానికి చెందిన లంబాడ వెంకటమోహన్‌కు 5 లక్షలు, నీలిభద్ర గ్రామానికి చెందిన యర్ర వసంతరావుకు 5 లక్షలు, నీలావతి గ్రామానికి చెందిన బొంగు కేధారమ్మకు 7 లక్షల రూపాయల దీర్ఘకాలిక రుణాలను భూ అభివృద్ధి కోసం మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సిఇవో శ్రీనివాసరావు, డిసిసిబి బ్యాంక్ మేనేజర్, సూపర్‌వైజర్, తర్లాకోట సర్పంచ్ కొర్ల సంతు, కేదారిపురం సర్పంచ్ ధనుంజయలతో పాటు రైతులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన అవసరం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన చాలా అవసరమని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండే ఇది సాధ్య పడుతుందని మండల విద్యాశాఖాధికారి దల్లి తులసిరావు అన్నారు. శుక్రవారం మండలం నువ్వలరేవు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతి, వివేకానంద విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ఎంతో అభివృద్ధి చేస్తుందని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. దాతల సహకారంతో నువ్వలరేవు పాఠశాల అభివృద్ధిపథంలో నడుస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తూ తమ పిల్లలను పాఠశాలలకు పంపిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు కింతల సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బైనపల్లి ఆనంద్, వెంకటేష్, గ్రామస్తులు మువ్వల ఎఱ్ఱా, బైనపల్లి త్రినాద్, బి.నీలాంబర్, ఎం.దేవ, నవీన్, నీలాకర్, క్రిష్ణ, పూర్వ ప్రధానోపాధ్యాయులు బమ్మిడి చంద్రశేఖర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీర్మానం వెంటనే ఉపసంహరించుకోవాలి

ఆదివాసీసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు

విశాలాంధ్ర-మెళియాపుట్టి : బోయ, వాల్మీకీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆదివాసి సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తీర్మానం వెంటనే ఉపసంహరించుకోవాలని, స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న ఆదివాసుల అభివృద్ధి శూన్యమని, దారితప్పుతున్న వాటిని సరిచేసి ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బోయ, వాల్మీకి ఇతర కులాలను ఎస్టి జాబితాలో చేర్చడానికి ఉత్సాహం చూపిస్తున్నా తీరును నిరసిస్తూన్నారు. ప్రభుత్వంలోనున్న ఎంపీటీసీలు, సర్పంచ్లు, జడ్పిటిసిలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిదులు ప్రభుత్వముతో మాట్లాడి తీర్మానం రద్దు జరిగేలా చేసి పోరాడి మన రిజర్వేషన్ భావితరాలకు అందించే వరకు ప్రతీ క్షణం పోరాటానికి సంసిద్ధులుగా ఉండాలన్నారు.

అనురాధకి శుభాకాంక్షలు తెలుపుతూ విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-టెక్కలి : ఎమ్మెల్సీగా విజయం సాధించిన పంచుమర్తి అనూరాధకి శుభాకాంక్షలు తెలుపుతూ టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో టెక్కలిలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. వైసిపి అసంతృప్తి ఎమ్మెల్యేల సహకారంతో విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు ఆనందో త్సవాల్లో మునిగితేలారు ముందుగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్, మామిడి రాము, మట్టా పురుషోత్తం, కోళ్ల కామేష్, మెండ దమయంతి, ఇప్పిలి జగదీష్, రేయ్యి ప్రీతీష్ చంద్ర, దల్లి ప్రసాద్ రెడ్డి, బుడంకాయల అభిలాష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కోటి లింగేశ్వర ఆలయ శంకుస్థాపన

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం బారువలో గల శ్రీకోటి లింగేశ్వర ఆలయ శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దున్న గురుమూర్తి దంపతులు ఆలయ నిర్మాణానికి కోటి 34లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించిన విషయం తెల్సిందే. ఈ మేరకు వారి చేతుల మీదుగా జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా సీనియర్ అర్చకులు భువనేశ్వర పాణిగ్రాహి ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఎఱ్ఱ రజిని కుమారి, ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, జెడ్పీటిసి తడక యశోద, వైస్ ఎంపిపి గుర్రాల శ్రీను, జుత్తు నీలకంఠం, సోమశేఖర్, టి.విశ్వనాథం, ఎం.చంద్రశేఖర్, తడక జోగారావు, పొదుగు కామేష్, తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం పుట్టినరోజు వేడుకలకు భారీ ఏర్పాట్లు

విశాలాంధ్ర-కొత్తూరు : ప్రముఖ విద్యావేత్త ప్రముఖ కార్పొరేట్ సంస్థలో ఉన్నత ఉద్యోగిగా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణచేసి పాతపట్నం నియోజకవర్గం నుండి రానున్న ఎన్నికలలో పోటీచెయ్యాలని నిర్మాణఇంచుకున్న సిరిపురం తేజేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు ఈనెల 26 తేదీ న ఘనంగా నిర్వహించాలని సిరిపురం మిత్రబృందం, అభిమానులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు ఈ మిత్ర బృందంలో ముఖ్యులైన సర్పంచ్ సంఘం ప్రతినిధి షణ్ముఖరావు ఇక్కడ మీడియాకు శుక్రవారం తెలిపారు. ఆరోజు ఉదయం కేక్ కెటింగ్, దేవాలయంలో పూజలు, అభిమానులు ఏర్పాట్లు చేసిన సభ అనంతరం విందు ఏర్పాటు ఉంటుందని తెలిపారు. నియోజకవర్గం గల 5 మండలాలు నుండి ఆరువేల మంది వరకు సిరిపురం పుట్టినరోజు వేడుకల్లో పాలుపంచుకుంటా రని తాము భావిస్తున్నట్లు షణ్ముఖరావు తెలిపారు.

లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా 'సదాశివుని కృష్ణ'

విశాలాంధ్ర-నరసన్నపేట : 2023-24 సంవత్సరానికి సంబందించి లయన్స్ క్లబ్ మిలీనియం అధ్యక్షునిగా సదాశివుని కృష్ణ నియమితులయ్యారు. కొద్దిరోజుల్లో క్లబ్‌కు చెందిన సభ్యుల వివరాలు ప్రకటిస్తామని తెలి పారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన కృష్ణకు శిష్టకరణ కార్పొరేషన్ ప్రతినిధులు, శిష్టకరణ సంఘ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

సెంచూరియన్ యూనివర్సిటీలో మత్స్యకారులకు శిక్షణ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండలం వడ్డీతాండ్ర మత్యకార సంఘానికి సంబంధించి మత్స్యకారులతోపాటు, మరికొంతమంది మత్స్యకారులు ఒరిస్సా రాష్ట్రంలోగల సెంచరియన్ యూనివర్సిటీలో శనివారం శిక్షణ కార్యక్రమానికి వెళ్లి శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపలు రొయ్యలు ఇతర మత్య సంపదతో విలువ ఆధారిత ఉత్పత్తులు ఎలా చేయాలి అనే అంశంపై నైపుణ్యత గల అధికారులతో శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా సహాయ సంచాలకులు సూర్యనారాయణ, టెక్కలి ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ ధర్మారావు పాత్రో, విద్యాసాగర్, ఫిషరీస్ అసిస్టెంట్ లు దామోదర్, నవీన్, నరేష్, చురియన్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఇతర అధికారులు, 25 మంది మత్స్యకారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని అంతం చేయగలం

విశాలాంధ్ర-హిరమండలం: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండలకేంద్రమైన హిరమండలం న్యూ బారేజ్ సెంటర్, సుభలయలో క్షయ వ్యాధి గురించి అవగాహన కల్పిస్తూ శుక్రవారం రాలీ నిర్వహించారు. అనంతరం హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి గ్రస్తులకు డా. రెడ్డిస్ లాబొరేటరీస్ వారి సహకారంతో ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. తదనంతరం క్షయ యూనిట్ పాతపట్నం పరిధిలో ఉన్న 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్షయ నిర్మూలనకు ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించి మోమెంటోలను క్షయ యూనిట్ మెడికల్ ఆఫీసర్ బహుకరించారు. తదుపరి క్షయ యూనిట్ పాతపట్నం సిబ్బంది క్షయ యూనిట్ మెడికల్ ఆఫీసర్ సన్మానం చేశారు.

క్షయ యూనిట్ పాతపట్నం మెడికల్ ఆఫీసర్, హిరమండంం పిహెచ్ సి వైద్యధికారి డా సాయి గీత మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని, 2025 నాటికి పూర్తిగా క్షయ వ్యాధి అంతం అవ్వాలని ఆ దిశగా కృషి చేయాలని కోరారు. రెండు వారాలకి మించి దగ్గు, సాయంత్రం వెళ్ళాలో జ్వరం, బరువు తగ్గటం, ఆకలి తగ్గిపోవటం లాంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు వచ్చి క్షయ నిర్ధారణ పరీక్ష చేసుకోవాలని కోరారు. క్షయ నిర్ధారణ అయిన వారికి ఉచితంగా 6 నెలల పాటు మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని అదే విధంగా పౌష్టికాహారం కొరకు నెలకి రూ.500లు రోగి ఖాతాలో జమచేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మీసాల షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలతో ప్రజలకు ఇబ్బందులు

- క్షణక్షణం... భయం భయం...
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలంలోగల పలు పంచాయతీలలో ఇంటికి అనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి గోడలకు ఆనుకునే విధింగా ఉన్న విద్యుత్ తీగలతో భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి పక్కగా ఉన్న కరెంట్ స్తంభాలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలను సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసి తమ ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్నారు. అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తీసి ఇతర ప్రాంతాల్లో ఏర్పాట చేయాలని.. ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. కోటబొమ్మాళి మండలంలోని కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోని ప్రకాషనగర్ కాలనీ, కొత్తపేట పంచాయతీ ఇందిరమ్మ కాలనీలలో ఇంటి మీద 11 కేవీ విద్యుత్ లైన్లు పోవడంతో ఆ కుటుంబాలు క్షణం.. క్షణం భయం భయంగా బ్రతుకుతున్నారు. ఇటీవల ఆ గ్రామస్తులు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దుక్క రోజారామక్రిష్ణకు తెలియజేయటంతో ఆయన స్పందించి విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడడం ఆ సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అయితే ఇంతవరకు విద్యుత్ అధికారులు ఆ సమస్యను గాలికి వదిలేసారని గ్రామస్థులు అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ ఇంటిలపై వెలుతున్న ఐపవర్ విద్యుత్‌లైన్లును మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

26న తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆత్మీయ సదస్సు

సదస్సుకు అధికసంఖ్యలో హాజరు కావాలని ప్రతినిధుల పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : తూర్పుకాపు సంక్షేమ సంఘం ఐక్యతకు, సంఘ బలోపేతానికి సంబంధించి ఈ నెల 26న తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నామని సంఘ జిల్లా అధ్యక్షులు సురంగి మోహనరావు, సంఘ ప్రతినిధులు ఎస్ కె.నాయుడు, రాడ కైలాసరావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన తూర్పు కాపు సామాజికవర్గం సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతి అభ్యున్నతికి, అభివద్ధికి సామాజికవర్గానికి చెందిన అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యనేతలు, వివిధ శాఖల్లోని ఉద్యోగులు, సంఘ ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సూచనలు, సలహాలు అందించాలని తూర్పుకాపు ఉద్యోగ సంఘ ప్రతినిధులు ఎల్‌వి రాజశేఖర్, డాక్టర్ రామజోగినాయుడు, కిలారి నారాయణరావులు, అంకడాల తవిటమ్మ, పి.తవిటినాయుడులు కోరారు. ఈనెల 26న కోడిరామ్మూర్తి స్టేడియం సమీపంలో ఉన్న అంబేద్కర్ ఆడిటోరియంలో ఉదయం 10. 30 గంటలకు ఆత్మీయ సదస్సు ప్రారంభమవుతుందని చెప్పారు. తూర్పుకాపు జాతి బిడ్డలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెడ్డ వారితో జాగ్రత్త

- క్రమశిక్షణతోనే అందమైన జీవితం
- విద్యార్థినులకు పోలీసులు పిలుపు

విశాలాంధ్ర-కంచిలి: ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పట్టుదల ఏకాగ్రతతో పాటుగా పాఠశాల ఆవరణలో సోదర భావంతో మెలిగి చెడు స్వభావం కలిగిన వ్యక్తులకు కొత్త వ్యక్తులకు దూరంగా ఉండాలని సెల్ ఫోన్లు జోలికి వెళ్లొద్దని కాశిబుగ్గ సబ్ డివిజనల్ పోలీసులు స్ఫూర్తి కల్చరల్ టీం ఆధ్వర్యంలో పోలీసులు విద్యార్థిల కు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ మేరకు శుక్రవారం జాడపూడి గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలతో ప్రత్యేక అవగాహన నదస్సును కల్చరల్ టీం ఏర్పాటుచేసి పలు చట్టాల అవగాహన కల్పిస్తూ ముఖ్యంగా బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కోసం మానవ అక్రమ రవాణా కోసం ఫోక్సోచట్టం కోసం వివరించారు. ఇటీవల కాలంలో పలు ప్రాంతా లలో బాలికలపై జరిగిన ఘోరమైన సంఘటన కోసం వివరించారు. సెల్ఫోన్లో చాటింగ్ చేయడం కొత్త వ్యక్తులు తో జాగ్రత్తగా ఉండమని జరిగిన కొన్ని సంఘటన వివరిస్తూ చెడు ప్రవర్తనతో ఉన్న వారికి దూరంగా ఉండాలని తెలియజేస్తూ ప్రతి ఒక్కరు కుటుంబ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కష్టపడకుండా ఇష్టపడి చదవాలని జీవిత లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రులకు మంచి బహుమతి అందించాలని తెలియజేశారు. అందమైన జీవితాన్ని సాధించాలంటే అది మన నడవడిక మీదే ఆధారపడి ఉంటుందని ఎటువంటి చెడు సంఘటన జరిగిన వెంటనే మీ ప్రిన్సిపాల్ కు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. కానిస్టేబుల్ జీవన్ రత్నం పాట రూపంలో విద్యార్థులకు జీవితంలో ఎలా ఉండాలి లక్ష్యసాధన కోసం మనం ఏ విధమైనటువంటి ప్రవర్తనతో నడుచుకోవాలన్న విషయంపై పాట రూపంలో వివరిస్తూ విద్యార్థిలకు ఎంతగానో ఆకట్టుకున్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యా లయం ప్రిన్సిపాల్ వి.వాణికుమారి మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్ఫూర్తి కల్చరల్ టీమ్ ఏర్పాటుచేసిన ఈ అవగాహన సదస్సులు ఎంతో గొప్పవని ఇటువంటి సదస్సులు ఏర్పాటు చేయడం వలన విద్యార్థులలో మంచి మార్పు వచ్చే అవకాశం ఉందని పోలీస్‌శాఖకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ సబ్ డివిజన్ స్ఫూర్తి కల్చరల్ టీం సభ్యులు సత్యరాజ్ రవి మోహిని అనూష కుసుమ మురళి జంగమయ్య విద్యార్థులకు పలు చట్టాల కోసం వివరిస్తూ సమాజంలో జరిగిన జరుగుతున్న సంఘటన కోసం వివరిస్తూ బాల బాలికలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలికలు ఉపాధ్యాయ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులు ఏరి?

- వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండానే రోగులకు మందులు అమ్ముతున్న మెడికల్ దుకాణాలు
- క్షేత్ర స్థాయిలో డ్రగ్స్ అధికారుల తనిఖీలు శూన్యం
- మెడికల్ షాపుల్లో ఇష్టారాజ్యంగా మందుల విక్రయాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మెడికల్ దుకాణాలు ప్రభుత్వ నిబంధనలకు పాతర వేస్తున్నాయి. ఫార్మసిస్టులు లేకుండానే మెడికల్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. అస్వస్థతకు గురైన రోగులకు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండానే యథేచ్ఛగా మందులు విక్రయిస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆదేశాలు.. ఎక్కడా నిబంధనలు అమలుచేయడం లేదు. కొటబొమ్మాళి, కొత్తపేట, నిమ్మాడ తదితర గ్రామాలలో మందుల దుకాణాల్లో చీటి లేకుండా మందుల విక్రయాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల కాలపరిమితి ముగిసిన మందులను రోగులకు అంటగడుతున్నారు. ఔషధ తనిఖీ అధికారులు మామూళ్ల మత్తులో ఉంటూ దుకాణాల వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ముఖ్యంగా ఒళ్లునొప్పులు, జ్వరం, తలనొప్పి మందులకు సంబంధించి దుకాణాలలో కాలపరిమితి ముగిసిన విక్రయాలు జరుపుతున్నారు. కోటబొమ్మాళి మండల రూరల్ ప్రాంతాలలో మందుల దుకాణాలలో ఎటువంటి నిబంధనలు అమలు కావడం లేదు. ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసిన క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ముఖ్యంగా మందుల దుకాణాలలో నిరాక్ష్యరాసిత కలవారే పనిచేస్తున్నారు. దుకాణ యజమానులు చెప్పిన మందులను మాత్రమే అందిస్తున్నారు. చీటిలో ఉన్న మందులు కానీ, వైద్యులు చిటి కానీ ఆ రోగికి కావాల్సిన మందులను అందించడంలో ఏమాత్రం మొగ్గు చూపడం లేదు. విక్రయించిన మందుల ధరలలో కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. 10 మాత్రలు ఉన్న స్లిప్ పైన రూ 20లు ధర ఉన్న మందులను విడివిడిగా విక్రయిస్తూ ఒక్కొక్కటి రూ. 5లు, రూ. 6లకు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. ఉన్నతాధికారులు ప్రతి దుకాణంలోను తప్పనిసరిగా వైద్యులు ఇచ్చిన చీటి ఉంటేనే మందులు విక్రయించాలని డ్రంగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసిన సంబందిత అధికారులు నిబంధనలు అమలు చేయడం లేదని, దీంతో మెడికల్ షాపుల్లో ఇష్టారాజ్యంగా మందులు అమ్ముతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించని మందులు షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ట్రిపుల్ ఐటి శ్రీకాకుళం క్యాంపస్లో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే సి రెడ్డి తెలిపారు. ఇక్కడ క్యాంపస్ ను శుక్రవారం ఆయన సందర్శించిన సందర్భంగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి క్యాంపస్లో ప్రస్తుతం 3500 మంది విద్యార్థులు ఉన్నారని, భవిష్యత్తులో ఈ సంఖ్య 6వేలకు చేరుకుంటుందని చెప్పారు. రానున్న వేసవి దృష్ట్యా నీటి సమస్య రాకుండా రెండు బోర్లు వేస్తున్నామని చెప్పారు. ఈ క్యాంపస్ లో నీటి సమస్య తలెత్తకుండా ఎస్ ఎం పురం పెద్ద చెరువులో బోరుని ఏర్పాటు చేసి అక్కడ నుంచి పైపులైన ద్వారా క్యాంపస్కు నీరు తీసుకువచ్చేందుకు వీలుగా రూపొందిస్తున్న ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్కు పంపిస్తామన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలు పూర్తిచేసేలా చర్యలు చేపడతామన్నారు. అలాగే భావన నిర్మాణాలకు నాడు నేడు పథకంలో విధులు మంజూరుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ రావు ఓఎస్డి ప్రొఫెసర్ ఎల్ డి సుధాకర్ బాబు ఏవో ముని రామకృష్ణ అకాడమిక్ డీన్ మోహన కృష్ణ చౌదరి క్యాంపస్ ఇంజనీర్ సురేష్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్లంలో పట్టు సాధించాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మాతృ భాష ముఖ్యమైందని, ప్రస్తుత పరిస్థితుల్లో వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో ఇతర భాషల అవసరం కూడా ఉందని పోలీస్ ఇన్స్పెక్టర్ ఈశ్వర్చంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం శాంతినికేతన పాఠశాల చైర్మన్ దక్కత కృష్ణమూర్తి అధ్యక్షతన పాఠశాలలో ఈ.ఈ.ఎల్.ఎల్ ఇంగ్లీష్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్స్పెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు ఆంగ్ల భాష పట్ల కూడా విద్యార్థులు శ్రద్ధ వహించాలని, భయాన్ని వీడి సాధన ద్వారా సులభంగా ఆంగ్లాన్ని నేర్చుకోవచ్చని వివరించారు. ఎక్స్ప్రెసివ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబ్ గురించి ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇంగ్లీష్ భాషతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఇంగ్లీష్లో ధారాళంగా మాట్లాడితే వివిధ వర్గాల వారిని ఆకట్టుకోవడం ద్వారా ప్రయోజనం పొందవచ్చని, ముఖ్యంగా పోటీ పరీక్షల్లో, ప్రభుత్వ ప్రైవేట్ కార్పొరేట్ రంగ ఇంటర్వ్యూలలో విజయం సాధించాలంటే ఇంగ్లీష్ భాష పై మంచి పట్టు ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈ.ఈ.ఎల్.ఎల్ ధృవపత్రాలు అందజేశారు . అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి దక్కత ఇంధిర, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయిక్, కేసి పూరి, శంకర్, శ్రీధర్, పద్మజ, స్నేహ, రాజ్యలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

రాహులపై తప్పుడు కేసు బనాయించిన బీజేపీ

విశాలాంధ్ర-ఆమదాలవలస : కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాహుల్ గాంధీ పై బిజెపి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తుందని శ్రీకాకుళం పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సనపల అన్నాజి రావు అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఇటీవల రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్రలో ప్రజాదరణ చూసి ఓర్వలేక పాత కేసులను తిరగ తోడుతున్నారని విమర్శించారు. అభివృద్ధి చేయటం లేదని ప్రశ్నించే గొంతు లపై ఉగ్రవాదపు కత్తులు మోపుతున్నారని దుయ్యబట్టారు. బిజెపి అధికారం చేపట్టిన నాటి నుంచి నెహ్రూ గాంధీ కుటుంబాలపై కక్ష కట్టారని వారికి ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేక తప్పుడు కేసుల తో వేధింపులకు గురి చేస్తున్నారని, ఇప్పటికైనా బిజెపి నాయకులు కక్ష పూరిత చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

తల్లి చెంతకు అనాథ బాలుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: అనాథ బాలుడిని శ్రీకాకుళం మానవ అక్రమరవాణా నిరోధక విభాగం పోలీసులు రెండు సంవత్సరాల అనంతరం తల్లి చెంతకు చేర్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక సమక్షంలో బాలుడిని తల్లికి అప్పగించారు. వివరాలులోకి వెళ్తే... జిల్లాలో ఓ గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం పసిబిడ్డను వదిలిపెట్టి తల్లి వలస

వెళ్లిపోయింది. స్థానికులు సహాయంతో ఆశ వర్కర్స్ ఆ శిశువుని శ్రీకాకుళం లో ఓ శిశుగృహం లో చేర్పించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి సూచనలు మేరకు మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులు తల్లి మచిలీపట్నంలోని చిలకలపూడి గ్రామంలో ఉంటున్నట్లు గుర్తించి, ఆమెను తీసుకువచ్చి బాలల సంక్షేమ సమితి వారి సమక్షంలో తల్లిదండ్రుల యొక్క వివరాలను తనిఖీ చేసిన శ్రీకాకుళంలో ఓ అనాథ శరణాలయం లో ఉంటున్న బాలుడిని తల్లికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలుదుని ఉన్నత విద్యను అందించి, మంచి ప్రయోజకుదుని చేయాలని ఎస్పి పేర్కొన్నారు. బాలుడిని తల్లి చెంతకు చేర్చడంలో కృషి చేసిన ఏ.హెచ్.టి.యూ విభాగం పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి విఠలేశ్వర్, ఏ.హెచ్.టి.యూ విభాగం ఎస్ఐ కేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్గాంధీపై వేటు బీజేపీ పిరికిపంద చర్య

విశాలాంధ్ర-పొందూరు: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై వేటు బీజేపీ ప్రభుత్వ పరికి పంద చర్య అని జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పైడి నాగభూషనరావు అన్నారు. మండ లకేంద్రంలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీని పార్లమెంటులో ఎదుర్కోలేక బీజేపీ దొడ్డిదారిలో రాహుల్పై వేటు వేస్తారన్నారు. దేశంలో ఆర్థికకుంభకోణా లకు పాల్పడి దేశాన్ని దోచుకున్న దొంగల గురించి పార్టీ నాయకుడిగా మాట్లాడడం తప్పా అని ప్రశ్నించారు. దేశంలో ప్రస్తుతం అదానీ విషయంపై జేపీసీ కోసం పట్టుబడుతున్న రాహుల్గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక మోడీ, అమితాలు దిగజారుడుప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ రాహుల్గాంధీని అడ్డుకోవాలని ఎన్ని కుతంత్రాలు పన్నినా రాహులకు సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందన్నారు.

ఎన్.ఎం.ఎం.ఎస్.లో అర్హత సాధించిన విద్యార్థులు

విశాలాంధ్ర - మెళియాపుట్టి : కేంద్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్షలో మెళియాపుట్టి మండలానికి సంబంధించిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అర్హత సాధించి సత్తా చాటారు. మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పొట్నూరు ఆదినారాయణ గుప్త పుత్రిక పొట్నూరు దివ్యశ్రీ (114) మార్కులు సాధించారు. అదేవిధంగా చాపర జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఆర్. అశ్విని, జె. హర్షిత, ఎస్. కవ్యలు అర్హత సాధించగా, కొసమాల పాఠశాలకు చెందిన నీలపు జ్యోత్స్న, నీలపు హర్షవర్ధన్, రుద్రపంక్తి జస్వంత్, గొప్పిలి పాఠశాలకు చెందిన పరిగ భవాని, చీపురుపల్లి పాఠశాలకు చెందిన మీసాల ప్రసన్న, పెద్దపద్మపురం పాఠశాలకు చెందిన శ్యామసుందరరావు, గేదెల నరేష్లు అర్హత సాధించారు. దీంతో మెళియాపుట్టి ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, జి.గణపతిరావు, హేమలత, పూర్ణచంద్రరావు, బుడ్డోడు తదితర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తపరిచారు. అనంతరం అర్హత సాధించిన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి పదిమందికి ఆదర్శంగా నిలవాలన్నారు.

మున్సిపల్ చైర్మన్ గిరిబాబుకు సన్మానం

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం చైర్మన్ బల్ల గిరిబాబు పదవీ చేపట్టి శుక్రవారం రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా మున్సిపల్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్.ఐ వై.అప్పలస్వామి, పండా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చు

విశాలాంధ్ర-కవిటి: ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలు సొంతం చేసుకోవచ్చని స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్పంచ్ పూడి లక్ష్మణరావు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రత్యేక శ్రద్ధతో చదివి పరీక్షల పట్ల భయం వీడి ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చలపరాయి చాణక్యచంద్ర కచేరి ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది,పిఎంసి చైర్మన్ ఎం కృష్ణారావు,వైఎస్ఆర్ రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నర్తు రామారావుకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-కవిటి : శ్రీకాకుళం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన నర్తు రామారావుకు కొత్త పుట్టుగలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈమేరకు ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ ప్రతినిధి పిలక సంతోష్ తోపాటు మండల డ్వాక్రా సంఘాల మహిళలు, ఏపిఎం సనపల ప్రసాద్, విఓఏ (గ్రామ సంఘ సహాయకులు) ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎంపీపీ నర్తు చామంతి లకు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కుసుంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ ఊర్మిళ బిసాయి, ఎంపీటీసీ సభ్యులు కర్రీ పద్మావతి సత్యనారాయణ, పిసీ చైర్మన్ పాపారావుల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ మేరకు శుక్రవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామారావు, మాజీ సర్పంచ్ బత్తిన సాంబమూర్తి, మాతృమూర్తి యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు నల్లాన నాగు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు 300 ఎకరాలలో మొక్కజొన్నపంట నష్టం

విశాలాంధ్ర-పొందూరు : అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు మండలంలో సుమారు 300 ఎకరాలు మొక్కజొన్న పంట నేలకొరిగింది. తండ్యాం పంచాయతీ పరిధిలోనే 225 ఎకరాల మొక్కజొన్న పంట నేల కొరిగి తీవ్రంగా దెబ్బతింది.త తండ్యాంలో 425 ఎకరాలపంట మొక్కజొన్న సాగవుతుండ గా రెండవపంటగా వేసిన 225 ఎకరాలు పూర్తిగా నేలకొరిగింది. బాణాం, బి. కంచరాం, తదితర గ్రామాలలోను మొక్కజొన్న దెబ్బతింది. దెబ్బతిన్న మొక్కజొన్నను ఏవో బాబి. గ్రామ సచివాలయ ఆగ్రికల్చరల్ అసిస్టెంట్లు పరిశీలించారు. మొక్కజొన్న పంట దెబ్బ తిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చేయిచేయి కలపాలి... క్షయ వ్యాధిని అరికట్టాలి

- క్షయ వ్యాధి ఆరు నెలల్లో తగ్గుతుంది
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: చేయి చేయి కలిపి క్షయ వ్యాధిని అందరూ కలసికట్టుగా పారద్రోలాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబర్ట్ కాక్ అనే శాస్త్రవేత్త మైకో బాక్టీరియా ట్యూబర్క్యులోసిస్ ను కనుగొన్నారని చెప్పారు. దగ్గు క్రమం తప్పకుండా రెండు వారాల వరకు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులు వాడకం ప్రారంభించాలని తెలిపారు. చేయిచేయి కలసికట్టుగా క్షయ వ్యాధిని పారద్రోలాలన్నారు. జిల్లాలో క్షయ వ్యాధి పీడుతులు కోసం సమర్ధవంతమైన చికిత్స అందించుటకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. మందులు ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. వ్యాధి మందులు వాడితే 6 నెలల్లో తగ్గిపోతుందని పేర్కొన్నారు. తొలిత జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వైద్య ఆరోగ్యం శాఖ కార్యాలయం నుండి జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు, ర్యాలీలో భాగంగా జిల్లా కలెక్టర్ ర్యాలీలో పాల్గొన్న వారితో ఏడు రోడ్ల కూడలి వద్ద ప్రతిజ్ఞ చేయించారు.

జిల్లా వైద్య ఆరోగ్యం అధికారాణి డా. బి. మీనాక్షి రాబర్ట్ కాక్ మైకో బాక్టీరియా ట్యూబర్క్యులోసిస్ను కనుగొన్న శాస్త్రవేత్త చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ పిహెచ్ సి వైద్యాధికారి జంపు కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యం అధికారిణి మాట్లాడుతూ రెండు వారాలు తగ్గకుండా ఉంటే వెంటనే పరీక్షలు చేసుకోవాలని చెప్పారు. పరీక్షలు చేయడానికి అదునాతన పరికరాలు ఉన్నాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగానే ఇస్తారని వివరించారు. క్షయ నివారణాధికారిణి అనురాధ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు, ఈ వ్యాధి గాలి, తుంపుర్లు ద్వారా ఇతరులకు సోకుతుందన్నారు.

రెడ్ క్రాస్ చైర్మెన్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ దగ్గు, జలుబు, తదితరమైనవి ఉంటే వెంటనే పరీక్షలు చేసుకోవాలన్నారు. తీవ్రతను బట్టి మందులు కాలపరిమితి ఉంటుందని వివరించారు. అనంతరం రెడ్ క్రాస్ ద్వారా గత 6నెలల నుండి క్షయ వ్యాధితో చికిత్స పొందుతున్న పలువురికి పోషకాహారం కిట్లు అందజేశారు. అలాగే జిల్లాలో పలు చోట్ల 5వ విడతగా శ్రీకాకుళం, పాతపట్నం హిరమండలం నరసన్నపేట టెక్కలి ప్రాంతంలో గల సుమారు 600 మందికి పోషకాహారం కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంకటస్వామి, డి. పి. ఆర్. ఓ కె. బాల మాన్ సింగ్, డెమో వెంకటరమణ, ఫల్మనాలజిస్ట్ డాక్టర్లే ప్రదీపికా, డా. తిరుపతి రావు,లాబ్ టెక్నీషియన్లు, డా రెడ్డీస్ లేబ్ ఫౌండేషన్ కోర్డినేటర్ జి. సురేష్, అరబిందో ప్రతినిధి తదితరులకు జ్ఞాపికలు అందజేశారు. వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చు

సుదీర్ఘ పోరాటానికి శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర-పాతపట్నం : అంఖుటిత దీక్షతో అచంచలమైన ఆత్మవిశ్వాసంతో యజ్ఞంలా భావించి సామాజిక బాధ్యతతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చునని, దానికి లక్షలాది రూపాయల నిధుల వ్యయముతో అతి త్వరలో ప్రారంభంకానున్న రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ విశ్రాంతి భవన ఆధునికీకరణ పనులు ఒక ఉదాహరణ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. పాతపట్నం నియోజకవర్గం అధిక జనాభా కలిగిన సువిశాల భూభాగం. ఈ ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ నడిపే బస్సుల పైనే ఆధారపడి ప్రయాణం సాగిస్తూ ఉంటారు. పాతపట్నం నుండి దూర ప్రాంతాలకు మరియు దూర ప్రాంతాల నుండి ఈ పాటపట్టణాన్ని కలుపుతూ దూర ప్రాంతాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రజా రవాణా సంస్థ నలువైపులా బస్సులు ప్రయాణం సాగిస్తూ ఉంటాయి. దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనం నేడు శిథిలావస్థ దశలో ఉంది. అందువలన ప్రయాణికులు భయాందోళనకు గురౌతూ ఉన్నారని, ఆ స్థానంలో నూతన భవన నిర్మాణం చేపట్టాలని, ఆనాడు నిర్మించిన మరుగుదొడ్లు కూడా వినియోగానికి అనువుగా లేనందున ప్రయాణికులు, విధి నిర్వహణలో ఉన్న సంస్థ సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. వాటి నిర్మాణం కూడా చేపట్టాలని కోరారు. అదేవిధంగా ప్రయాణికులు, సిబ్బంది భోజన సమయాలలో తాగునీరు, వినియోగానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. నీటి సౌకర్యాన్ని కూడా కల్పించాలని తెలిపారు. విశ్రాంతి భవనానికి ఆనుకొని ఉన్న సంస్థ అత్యంత విలువైన స్థలాన్ని ఆక్రమాలకు గురికాకుండా వినియోగంలోకి తీసుకురావాలని అదేవిధంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ నూతనంగా ఏర్పడిన టెక్కలి రెవిన్యూ డివిజన్ కేంద్రానికి ఆ కార్యాలయ అవసరాల కోసం వెళ్లిన వారి కోసం రవాణా సంస్థ నడిపే బస్సు సౌకర్యాలను కల్పించాలని అదేవిధంగా ఇదివరకే రద్దు చేయబడిన ఈ నియోజకవర్గ పరిధిలోని బస్సులను మరల ప్రారంభించాలని, పెరుగుతున్న జనాభా ప్రయాణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నూతనంగా మరికొన్ని బస్సులను ప్రవేశపెట్టాలని ఇదివరకే జిల్లా ప్రజా రవాణా అధికారులతో పాటు డిపో మేనేజర్ కెఆర్ఎస్ శర్మతో పాటు డిఈఈ రవికుమార్ని, రీజనల్ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట రాజుని కోరానని, అందుకు వారంతా సానుకూలంగా స్పందిస్తూ పాతపట్నం నుండి శ్రీకాకుళంనకు నూతనంగా కొన్ని బస్సులను ఇదివరకే ప్రారంభించడం జరిగిందని సంస్థ యొక్క కొంత స్థలాన్ని ఇదివరకే నిబంధనలకు అనుగుణంగానే ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం జరిగిందని, మిగతా స్థలాన్ని కూడా ఇవ్వడానికి కార్యాచరణ ప్రారంభం జరుగుతుందని విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించబడినందున ఆధునికీకరణ పనులు, నీరు కోసం బోరుబావిని కూడా తవ్వే కార్యక్రమం అతి త్వరలో ప్రారంభించబడుతున్నదన్నారు. ఈ కార్యక్రమానికి పరిశీలనకు వచ్చిన డిపో మేనేజర్ టిఆర్ఎస్ శర్మ, డిఈ రవి కుమార్ తెలిపారు. అదేవిధంగా నా సామాజిక బాధ్యతను జిల్లా ప్రజా రవాణా అధికారులతో పాటు డిపో మేనేజర్ కెఆర్ఎస్ శర్మ, డిఈఈ రవి కుమార్తో పాటు రీజనల్ మేనేజర్ వారి కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట రాజు కూడా అభినందించారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి నారాయణమూర్తి అన్నారు.

క్షయ వ్యాధి అంటువ్యాధి

విశాలాంధ్ర-జలుమూరు : క్షయ వ్యాధి అంటువ్యాధి అని, రోగి తుమ్మినప్పుడు దగ్గినప్పుడు తుంపర్ల ద్వారా ఆరోగ్యవంతునకు సోకు తుందని డా.టి. శ్రీకాంత్ అన్నారు. మండలంలో క్షయవ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ఇది స్త్రీ పురుషుల కు ఏ వయసులో వారికి అయినా రావచ్చు నన్నారు. ఇది శరీరంలో ఏ భాగము కైనా రావచ్చని, ఎక్కువ ఊపిరితిత్తులకు వస్తుందన్నారు. క్షయ లక్షణాలు మూడు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం రావడం, ఆకలితోపాటు బరువు తగ్గటం, చాతిలో నొప్పి, ఉమ్ము లో రక్తం పడటం జరుగుతుందన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ మూడుసార్లు కఫం పరీక్ష చేయించటం, మూడుసార్లు నెగిటివ్ అయితే ఎక్స్రే తీయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది, ఆశ, ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా సాధించగలమని ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా కుటుంబ పరిస్థితులు కూడా బాగుంటాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. ఐ.సి.డి.ఎస్ నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణితో కలిసి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. సి.డి.పి.ఓ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలింతల ఆరోగ్యం విషయంలో అనేక కార్యక్రమాలు ఐ.సి.డి.ఎస్ ద్వారా నిర్వహిస్తుందని, ప్రజలకు అర్థమయ్యేలా వాటిని వివరించి అవగాహన కల్పించాలని కోరారు. గర్భిణీలు, బాలింతలు, 0-5 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం అందే విధంగా అవగహన కల్పించడం, వారు ఎటువంటి ఆహారం తీసుకోవాలో అంగన్వాడీల ద్వారా పోషన్ పక్వాడా -2023 అనే ఏక్టివిటీ క్యాలెండర్ సంబంధించి అవగాహన కల్పించడం జరుగుతుందని సమావేశంలో సి.డి.పి.ఓ తెలిపారు. అంగన్వాడీలు తయారు చేసిన పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఏ.డి.పి.ఓ లావణ్య, మెప్మా సి.ఎం.ఎం. జానకిరావు, అంగన్వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి దేవాలయ హుండీ ఆదాయం రూ.10,11,709

విశాలాంధ్ర-పాతపట్నం: శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం దేవదాయ ధర్మదాయ శాఖ, పాతపట్నం శుక్రవారం 84 రోజులకు గాను హుండీ లెక్కించగా 10,11,709 రూపాయలు భక్తుల ద్వారా హుండీ ఆదాయం సమకూరింది. ఈ లెక్కింపులో శ్రీకాకుళం సహాయ కమిషనర్ వారి కార్యాలయం నుండి. జివిబియస్ రవికుమార్ సీనియర్ అసిస్టెంట్ వారి సమక్షంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి టి వాసుదేవరావు ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు కమిటీ సభ్యులు పద్ద నేతాజీ, సవిరిగాన కృష్ణారావు, ఆలయ అర్చకులు, పాతపట్నం వైస్ ఎంపీపీ ప్రదీప్ కుమార్, ప్రదీప్ యువసేన సభ్యులు ఆలయ సిబ్బంది భక్తులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలోనే సాగుదార్లకు పట్టాలు : జేసీ కల్పనా కుమారి

విశాలాంధ్రబ్యూరో-అనకాపల్లి : గిరిజనులు సాగు చేసుకుంటున్న భూమి ప్రభుత్వ భూమి అయితేనే పట్టాలు ఇవ్వడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ. సదరు సాగు చేసుకుంటున్నా వారికి ఇతరత్రా భూమి ఉండకూడదన్నారు. రికార్డులను పరిశీలించగా చీడికాడ మండలం కోనాం శివారు కొత్త వీధి గ్రామం గ్రామంలో ఉన్న 289 సర్వే నంబరులో 29.86 సెంట్ల భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం రైతు వారి మెట్టు భూమిగా నమోదయిందని చెప్పారు. సదరు భూమిలో భూ నియంత్రణ చట్టం ప్రకారం 7.22 భూమిని ప్రభుత్వానికి దఖలు పరిచి నట్లు తెలిసిందన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వ భూమికి మాత్రమే పట్టాలు ఇవ్వగలమన్నారు. జిరాయితీ పట్టా కాబట్టి కౌలుదారులకు ఎటువంటి హక్కు ఉండదన్నారు. జిల్లాలో ప్రారంభించిన ఫేస్-1 రీ సర్వే 147 గ్రామాలలో పూర్తయిందని, మరో 100 గ్రామాలలో సర్వే జరుగుతోందని తెలిపారు. డ్రోన్ సర్వే దాదాపు పూర్తయింది అన్నారు.430 మంది సర్వేయర్లు పనిచేస్తున్నారని చెప్పారు. అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే సరి చేస్తామని చెప్పారు. జిల్లాలోని అనకాపల్లి, అచ్యుతాపురం, సబ్బవరం, పరవాడ ప్రాంతాలలో ప్రభుత్వ భూ ఆక్రమణలు తమ దృష్టికి వచ్చాయన్నారు. సాగుదారులు పేదవారైతే వారికి న్యాయం చేస్తామని, ధనవంతులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దేవాదాయ భూముల చట్టం వేరుగా ఉందని, స్వయంగా చర్యలు తీసుకోలేమని ఒక ప్రశ్నకు జవాబిచ్చారు.

సీతమ్మవారికి పుస్తెలు బహూకరణ

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని రాజపురం గ్రామం సీతారామాలయంలో గత ఐదు రోజులుగా ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సీతారాములకు ప్రత్యేక అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామ మహిళలుచే కుంకుమ పూజ కార్యక్రమం చేపట్టారు.ఈ మేరకు స్థానిక భక్తులు రెండు తులాల విలువైన బంగారు పుస్తెలు సీతమ్మ వారికి అలంకరణ చేశారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వర హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-జలుమూరు : శ్రీ ముఖలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఉన్న శ్రీ స్వామి వారి హుండీలను శుక్రవారం ఉదయం గం 11 లకు దేవాదాయ అధికారులు, అర్చకులు, గ్రామస్తులు, సత్యసాయి సేవా సమితి, కొమనపల్లి వారి సమక్షంలో హుండీ తెరిచి లెక్కించారు. 3 నెలల 25 రోజులకు గాను రూ.437519/- లు ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు.



పోలాకి ఎస్ఐకు దళిత హక్కుల పోరాటం డైరీని అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యద్ల గోపి.